# అహంకారి

**జిల్లేళ్ళ బాలాజీ**

**బస్టాండులో జనం పలుచగా వున్నారు. ఎన్నో బస్సులు వస్తున్నాయి... వెళుతున్నాయి... కానీ, నేను వెళ్లవలసిన బస్సు మాత్రం ఇంకా రాలేదు. అదెప్పుడు వస్తుందో చెప్పే నాధుడే లేడక్కడ?**



నాకు చాలా చిరాగ్గా వుంది. బయట ఎండ మాడ్చేస్తోంది. చెమటతో వొళ్లంతా తడిసి ముద్దయిపోతోంది. రాని బస్సు కోసం ఎదురు చూడ్డంలో నాకు అసహనం అంతకంతకూ పెరిగిపోసాగింది. ఏదన్నా పుస్తకం చదువుదామనిపించింది. సూట్‌కేస్ తెరిచి పుస్తకం తీస్తూ యాదృచ్ఛికంగా ఎదురుగా ఆగి వున్న బస్సు వైపు

చూసి ఉలిక్కిపడ్డాను.

అక్కడ... ఆ బస్సులో... ఓ యువతి ఏవో తిను బండరాల ప్యాకెట్లను అమ్ముతోంది ఆమె కళావతిలా వుండడమే నా ఉలికిపాటుకు కారణం. ఆమె భుజానికి వేలాడుతున్న సంచిలో ఇంకా చాలా రకాల ప్యాకెట్లున్నాయి. ప్రతి ప్రయాణీకుడి ముందుకూ చెయ్యి చాపుతోంది. కావలసిన వాళ్లు కొనుక్కుంటున్నారు. కొనుక్కున్న వాళ్ల దగ్గర నుంచి డబ్బులు తీసుకొని ముందుకు కదులుతోంది.

ఆమె బస్సులో నుండి కిందకు దిగింది. సందేహం లేదు. ఆమె కళావతే! చటుక్కున పుస్తకాన్ని ముఖానికి అడ్డుపెట్టుకున్నాను. అలా చెయ్యడం ఆమెకు భయపడి కాదు. నేనెవరో ఆమెకు తెలియకూడదని... అంతే!

అలా బస్సు దిగిన ఆమె వెనుక ఓ రెండేళ్ల పిల్లవాడు కూడా వున్నాడు. వాడు కళావతి కొంగుపట్టుకొని నడుస్తున్నాడు. వాడిని చూశాక నా గుండె ఎందుకో తీవ్రంగా స్పందించసాగింది. ఆమె నావైపు రావడంతో నా ముఖం కనిపించకుండా జాగ్రత్త పడ్డాను. నా పక్కన ఇంకా చాలా మంది బస్సు కోసం ఎదురు చూస్తున్న వాళ్లున్నారు. వాళ్లల్లో కొంత మంది కళావతి అమ్మే ప్యాకెట్లు కొని తింటున్నారు.

కొంటే ఆమె ముఖంలో సంతోషమో...వద్దంటే బాధపడ్డమో... ఏ భావాలు ఆమెలో కనిపించలేదు నాకు!! యాదృచ్ఛికంగా...నిర్లిప్తంగా...నిశ్శబ్దంగా చిప్స్ ప్యాకెట్లను అమ్ముకుంటోంది కళావతి!

ఆమె నా భార్య కాకపోయింటే నేనూ ఓ ప్యాకెట్ కొని ఆమెకు సాయం చేసుందును. కానీ... ఆమె ముందు వుంది 'నేను' అని తెలిస్తే చచ్చినా దాన్ని ఆమె నాకు అమ్మదు. ఆమె స్వభావం నాకు బాగా తెలుసు. అహంకారి! ఆ అహంకారమే ఇప్పటికీ ఆమె నుండి దూరం కాలేదని తెలుస్తోంది. ఆ అహంకారమే ఆమెను నానుండి దూరం చేసింది.

అలా నా నుండి దూరమైపోయిన ఆమె... ఇలా... బస్టాండులో చిప్స్ ప్యాకెట్లు అమ్ముతూ కనిపిస్తుందని నేను ఊహించలేదు. ఆమెకెందుకు ఈ దుస్థితి దాపురించింది? ఆమె తల్లి, తమ్ముడూ ఏమైనట్లు? ఆమె చేత ఈ పని ఎందుకు చేయిస్తున్నట్లు?

ఇలాగే ఓసారి ఏదో పండగకు వాళ్ల ఊరికి వెళదామని బస్టాండుకొచ్చాం. అప్పుడు కూడా ఎంతకీ బస్సు రాకపోయేసరికి బస్సు కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాం. ఓ పదహారేళ్ల అమ్మాయి ఏవో ఫారిన్ వస్తువులు చీప్‌గా అమ్ముతోంది. ఆ అమ్మాయి నా దగ్గరకొచ్చి "సార్... మీకు ఈ సెంట్ అయితే బావుంటుంది. సెంట్ రాసుకొని ఆఫీసుకెళితే అందరూ మీకేసి చూడాల్సిందే..." అంటూ చిలిపిగా నవ్వింది.

"అక్కర్లేదు..." టపీమని జవాబిచ్చింది. కళావతి.

"మీరుండండి మేడమ్! సార్ పర్సనాలిటీకి సెంట్ రాసుకోకపోతే ఎలా?" అంది మళ్లీ నవ్వుతూ ఆ అమ్మాయి.

టైమ్ పాస్ కోసం "ఎంత?" అని అడిగాను.

"ఎంత సార్, జస్ట్ థర్టీ రూపీస్...రాసి చూడండి. తెలుస్తుంది. దీని మజా.." అంటూ బాటిల్ మూత తీసి కాస్త వేలికి అద్దుకొని నా వొంటికి రాసింది. కితకితలు పెట్టినట్లు అనిపించింది.

ప్యాంటు జేబులో నుండి పర్సు తీసి థర్టీ రూపీస్ తీసి ఇవ్వబోయాను.

"సార్...రెండు బాటిల్స్ తీసుకోండి! ఫిఫ్టీ రూపీస్‌కే ఇస్తాను. టెన్ రూపీస్ కన్సెషన్."

నవ్వుతూ ఫిఫ్టీ రూపీస్ నోటు ఇవ్వబోయాను.

అప్పటి దాకా ముఖం గంటుపెట్టుకొని, తనను కాదని నాకు సెంటు బాటిల్ అమ్ముచూస్తున్నందుకు ఆ సేల్స్‌గర్ల్‌పై రుసరుసలాడుతోంది కళావతి.

అంతే! విసురుగా నా చేతి నుంచి పర్స్ లాక్కొని "వద్దన్నాగా, వెళ్లు..." అని ఆ అమ్మాయిని కసురుకుంది.

"మీరేంటి? మీకసలు సెంట్ అవసరమా? సెంట్ లేకుండా ఆఫీసుకు వెళ్లలేరా? ఆడది పళ్లికిలిస్తూ ఇస్తే తీసేసుకోవడమే... మీ మగాళ్లంతా ఇంతే..." అంది కోపంగా కళావతి.

సేల్స్‌గర్ల్ మౌనంగా అక్కడి నుంచి కదిలి వెళ్లిపోయింది.

కళావతి కోపానికి ఆ సేల్స్‌గర్ల్ అమ్మజూపిన సెంట్‌బాటిల్ కారణం కానే కాదు. తన మాట కాదని నాకు దాన్ని అమ్మజూపడమే అసలు కారణం. తన మాటే చెల్లుబాటు కావాలన్న పంతం కళావతిది.

ఇలాగే ఓ సందర్భంలో ఆఫీసుకు వెళ్లడానికి ఆలస్యం అవుతోందని ఓ స్కూటరుంటే బావుండును అనిపించింది. అందుకే కళావతితో "స్కూటర్ కొందామనుకుంటున్నాను. ఓ ఇరవై వేలు మీ వాళ్లను సర్దమనకూడదూ?" అన్నాను.

"డబ్బు లేనపుడు స్కూటర్ కొనకపోతే ఏం? " అంది కళావతి.

"మొత్తం డబ్బు కావాలని మీ వాళ్లను అడగమనలేదుగా ఓ ఇరవై వేలు అడగమన్నా. ఆ మాత్రం అల్లుడికి సాయం చేయలేరా ఏం?"

"ఆశకు అంతే ముంది? ఎన్నైనా కోరవచ్చు. మీకు ఇప్పటికే ఎంతో చేశారు. వాళ్లను మళ్లీ మళ్లీ పీడించడం భావ్యం కాదు"

"పీడిస్తున్నానా? స్కూటర్ కొనడానికి డబ్బు ఇవ్వమని అడగడం పీడించడమా? అసలు ఇప్పటిదాకా ఏం కొనిచ్చారు మీ వాళ్లు?"

"మీరేగా పెళ్లిలో స్కూటర్ వద్దని పెద్ద ఫోజు కొట్టారు. మళ్లీ ఇదేంటి? అసలు మావాళ్లు మీకేం తక్కువ చేశారని? ఇలాగని ముందే తెలిసుంటే నేను అసలు పెళ్లే మానుకుందును"

"మానుకొని వుండాల్సింది? అప్పుడు తెలిసుండేది. నా విలువ. నేను కాదనుంటే నీకసలు పెళ్లే అయి వుండేది కాదు." అన్నాను చులకనగా.

"అబ్బో ఇంతోటి మన్మథుడు దొరక్క నేను చచ్చిపోయి వుండేదాన్ని" అంది వ్యంగ్యంగా

"ఎంత మాటంది? మాటకు మాటా అంటోంది. ఎంత పొగరు? మగాడిని? పైగా మొగుడిని అన్న మర్యాద కూడా లేకుండా నోటికి ఎంత వస్తే అంతా ముఖంపైనే అనేస్తోంది."


"డబ్బివ్వడానికి మాత్రం వగలేదు. మాటలు చూడు కోటలు దాటుతున్నాయి. డబ్బిచ్చే యోగ్యత లేనప్పుడు నోర్మూసుకొని పడుండాలి. అంతేకానీ గొప్పలు పోకూడదు" అన్నాను.


"ఎందుకు? నోర్మూసుకోవాలి? మీరు నోటికొచ్చిందంతా అంటుంటే ఎందుకు పడాలి? నేనేం పౌరుషం లేని దాన్ని కాదు. మీరలా మాట్లాడుతుంటే నేనూ ఇలాగే మాట్లాడుతాను." అంటూ విసవిస లోపలికి వెళ్లిపోయింది కళావతి.

ఆ తర్వాత మూడు రోజులు నాతో మాట్లాడలేదు. నేనూ పలకరించలేదు. కానీ నాలుగో రోజు రాత్రి కళావతిని ప్రసన్నం చేసుకోవడానికి నేను ముందు మాట్లాడక తప్పింది కాదు.

అంత మొండితనం వున్న కళావతి తన 'డెలివరీ' విషయంలో ఎంత మొండికేసిందనీ?

"చూడు...కళా.. మొదటి ప్రసవం అమ్మగారింట్లోనే జరగాలని లేదు!! నిన్ను గవర్నమెంటు






ఆసుపత్రిలో కాక ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో చేర్చి నేనెంత ఖర్చయినా భరించగలను తెలుసా?'' అన్నాను కళ్లెగరేస్తూ...

''ఎంత ఖర్చయినా మా వాళ్లూ పెడతారులెండి. మీకా భయం అక్కర్లేదు. నా ప్రసవం సమయంలో మా అమ్మ నా దగ్గరుంటే కొండంత ధైర్యం నాకు! నేను మాత్రం మా పుట్టింటికే వెళతాను''

...అని, అలా ప్రసవానికి వెళ్లిన కళావతి, తాను ఎప్పుడు డెలివరీ అయిందీ, ఏ బిడ్డను ప్రసవించిందీ నాకు తెలియజేయలేదు. నేనూ అక్కడికి వెళ్లనే లేదు. బిడ్డనూ చూళ్లేదు... ఎంత అహంకారమున్నా మరీ ఇంత మొండితనం పనికిరాదు కళావతికి!!

ఏ బిడ్డ పుట్టిందీ భర్తకు తెలియజేయలేదంటే ఆ ఆడదాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

ఎప్పుడొస్తుందో రానీయ్...అప్పటి దాకా నేనూ వెళ్ల కూడదని గట్టిగా నిర్ణయించుకొన్నాను. అలా ఐదారునెలలు గడిచిపోయాయి. అసలేంటి వాళ్ల ఉద్దేశం? నన్ను పూర్తిగా మర్చిపోయారా? నేనంటూ ఒకడున్నానని వాళ్లకు తెలియదా? ఇక నా అవసరం వాళ్లకు లేదా? ఎంత గర్వం కళావతికి. అందుకే ఒళ్లు మండిపోయి.. నాకు సీరియస్‌గా వున్నట్లు ఒక టెలిగ్రామ్ ఇచ్చిపడేశాను. ఈ దెబ్బకు రాక ఛస్తుందా? మరుసటి రోజు మొదటి బస్సుకే వచ్చి దిగింది కళావతి. ఆశ్చర్యపోవడం ఇప్పుడు నా వంతు అయింది.

''ఏంటీ ఒక్కదానివే వచ్చావ్? బాబేడీ... నీ లగేజ్ ఏదీ?... అవునూ ఇంతకీ నీకు బాబా, పాపా'' అన్నాను.

''నీకూ ఏంటి అసహ్యంగా? మనకూ అనండి. ఏ బిడ్డయితే మీకేం? మీకు అక్కర్లేనప్పుడు?'' అంది నిష్ఠూరంగా...

''ఎవరికీ అక్కరలేదంటావ్? ప్రసవానికి పుట్టింటికి వెళ్లినదానవు... ఎప్పుడు ప్రసవించిందీ, ఏ బిడ్డను ప్రసవించిందీ అసలు నాకు తెలిపావా? నీకెందుకింత తలబిరుసుతనం...ఆఁ...'' అన్నాను హుంకరిస్తూ.

''తలబిరుసెవరికో నేను చెప్పను. ప్రసవానికి నన్ను మా పుట్టింటికి పంపాక అంతటితో అయిపోయిందా మీ పని? మళ్లీ నా యోగక్షేమాలేమైనా కనుక్కున్నారా? కనీసం ఒక్కసారైనా మా ఇంటికి వచ్చారా? ఎందుకండీ మీకంత చులకన నేనంటే? నేనంత పనికిరానిదాన్ననైనప్పుడు మన బిడ్డపై మాత్రం మీకు ప్రేమెలా పుడుతుంది? అందుకే తెలియజేయలేదు. నేను!!'' అంది ఆవేశంగా

''ఊరు వెళ్లేంతవరకూ నాతోనేగా వున్నావ్! అంతలోనే ఏమవుతుందేమిటి నీకు? పైగా నువ్వేం ఒంటరిగా అడవిలో లేవుగా...''

''అక్కడే మీరంటే మండుతుంది నాకు! ఎందరున్నా మీస్థానం మీదేగా? దాన్ని పలుచన చేస్తే ఎలా?'' అంది ఆవేదనగా...

''ఇది మనకెప్పుడూ ఉండేదేకానీ... ఇంతకీ నీకు...సారీ మనకు ఏ బిడ్డ పుట్టాడో చెప్పావు కాదూ...''

''నిజంగా మీకు తెలుసుకోవాలని వుందా?'' కళ్లార్పకుండా నన్నే చూస్తూ ప్రశ్నించింది కళావతి.

''అవును!'' అన్నాను

''అయితే అక్కడికే వచ్చి చూడండి!''

''అవును.. ఇప్పుడు బిడ్డను నీతో తీసుకురాలేదేం?''

''మళ్లీ వెంటనే వెళ్లాలనే తీసుకురాలేదు!''

''మళ్లీ వెళ్లడమేంటి? పుట్టింట్లో ఇన్నాళ్లున్నది చాలదా ఏం?'' అన్నాను విసుగ్గా

''అమ్మకు పక్షవాతం...నేను కాక అమ్మకు ఇంకెవరున్నారు చెప్పండి...''

''మరి నా పరిస్థితి...?''

''కొన్నాళ్లు సర్దుకోరూ...!'' అంది వేడుకోలుగా.

''అసలు నీకు సంసారంపైన పట్టింపూ, నేనంటే భయమూ ఏ కోశానా లేవు. ఎంతసేపూ పుట్టిల్లు, అమ్మా, తమ్ముడూ...వీళ్లే నీకు లోకం...''

''ఏం చెయ్యమంటారండీ....పుట్టినప్పటి నుండీ నాకన్నీ వాళ్లే చూసుకున్నారు. అమ్మా, నాన్న, తమ్ముడూ...వీళ్లే నాలోకమంతా! వీళ్లలో ఏ ఒక్కరికి ఏం జరిగినా అందరూ విలవిల్లాడిపోయేవాళ్లం. అలాంటిది నాన్న పోయాక అమ్మ సగమైపోయింది. ఇప్పుడీ పక్షవాతం. అమ్మను శారీరకంగానూ, మానసికంగానూ బాగా కృంగదీసింది. నన్ను కనీ... పెంచీ...పెద్ద చేసిన తల్లికి ఇప్పుడు కాక ఇంకెప్పుడు నా అవసరం వుంటుంది చెప్పండి...?''

''మరినా అవసరాలు చూసేదెవరంట?''

''నేనేననుకోండి...కాస్త మీరు నన్ను అర్థం చేసుకొని కొన్నాళ్లు అడ్జెస్ట్ చేసుకోండి ప్లీజ్!!''అంది అర్థిస్తూ....

''ఎప్పటిదాకా... మీ అమ్మ చచ్చేంత వరకా?'' అన్నాను ఈసడింపుగా...

ఆ మాటలతో గుండెలు పగిలినంత పనైంది కళావతికి. కళ్లల్లోంచి ఆమెకు తెలియకుండానే కన్నీళ్లు ఉబికిరాసాగాయి. కన్నీళ్ల మధ్య నన్ను అసహ్యంగా చూసింది కళావతి.

''అదేగా నీ అర్థం...కొన్నాళ్లంటే అంతేగా?'' అన్నాను నేను మళ్లీ రెట్టిస్తూ

మారు మాట్లాడకుండా మౌనంగా బయటకి దారితీసింది.

''ఆగూ...అంటే నీ ఉద్దేశం, నాకంటే వాళ్లే నీకు ముఖ్యమనా?''

''కాదు... ఇక వాళ్లే నాకు సర్వస్వం...''

''అయితే నీకిక్కడ స్థానం లేదు...''

''ఇంకెప్పుడూ రాను!''

''అదే..నా... నీ తుది నిర్ణయం?''

మౌనంగా బయటకు దారితీసిన కళావతి.... ఇన్నాళ్లకు ఇప్పుడు... ఇక్కడ... ఈ బస్టాండులో... ఇలా దర్శనమిస్తుందనుకోలేదు. నాకు దగ్గరగా వచ్చింది కళావతి. కళావతి మీద కన్న నాకు నా కొడుకు మీదే వున్నాయి కళ్లన్నీ. ఎంత ముద్దొస్తున్నాడు...వాడిని ఒక్కసారి దగ్గరకు తీసుకొని ముద్దుపెట్టుకోవాలని తీవ్రమైన కోరిక కలిగింది నాలో!

అంతే! ఇక ఆలస్యం చెయ్యలేదు నేను... మెల్లగా ముఖానికి అడ్డుపెట్టుకున్న పుస్తకాన్ని పక్కకు తప్పించాను. సరిగ్గా అదే సమయానికి కళావతి నా ముందుకు చిప్స్ ప్యాకెట్‌ను చాపింది. మా ఇద్దరి చూపులు కలుసుకున్నాయి. నన్ను చూసి షాక్ తింది కళావతి.

వంగి పిల్లవాడిని దగ్గరకు తీసుకోబోయాను. అంతే...విసురుగా వాడిని తన వైపుకు లాక్కుంది కళావతి.

''ఎందుకలా వాడిని లాక్కుంటావ్ కళావతీ? వాడిని తాకే హక్కు నాకు లేదా?''

''లేదు'' స్థిరంగా అంది కళావతి.

''అయితే వాడిని కష్టపెట్టే హక్కు నీకూ లేదు. ఇలా ప్రతి బస్సు ఎక్కి దిగుతూ అడుక్కు తినే బతుకు వాడికి అక్కర్లేదు. నాతో పంపించు...వాడిని మహరాజులా పెంచుతాను! ఇంజనీర్‌నుచేస్తాను...'' అన్నాను దర్పంగా...

''నా కంఠంలో ప్రాణం వుండగా మీతో మాత్రం పంపను. నన్నెంత మాత్రం చూసుకున్నారో తెలీదూ.... ఇక వాడిని కూడానా! వాడి దృష్టిలో వాళ్ల నాన్న ఎప్పుడో చనిపోయాడు. ప్రస్తుతం ఇప్పుడు వాడికి అన్నీ నేనే...'' అంటూ తన చేత్తో వాడిని గట్టిగా పట్టుకొని విసవిసా ముందుకు అడుగులేసింది కళావతి.

ఆ నడకలో వేగం వుంది. చురుకుదనం వుంది... వెనక్కు తిరిగి చూడకుండా ముందుకు వాడిని నడిపించుకు పోసాగింది...అహంకారి అయిన కళావతి!

★